క్లుప్తంగా

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

వేమూరు: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని తహసీల్దారు సుశీల తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించడం జరిగిందని, రెండు అర్జీలు అందజేశారని ఆమె తెలియజేశారు. వాటిని వెంటనే పరిష్కారం చేయడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి దేవస్థాన వార్షిక వేడుకలు



నగరం: మండలంలోని పూడివాడ గ్రామంలో వేంచేసి ఉన్న వేణుగోపాలస్వామి దేవస్థానం 100వ వార్షిక వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. వార్షికోత్సవ కరపత్రాలను ఆలయంలో ఆలయ ధర్మకర్తలు సోమవారం ఆవిష్కరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి 12 వరకు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రహదారులు నిర్మించండి



తెనాలిఅర్బన్: 32వ వార్డులో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని 32వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి, మట్లపూడి రాజేశ్వరరావు దంపతులు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. అలాగే చినరావూరుపార్కులో బోటింగ్, వాటర్ ఫాల్ సేవలు ప్రారంభించాలని, 30వ వార్డులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించాలని, అదే వార్డులో ఆటస్థలం ఏర్పాటు చేయాలని, 16వ వార్డులో కోదండ రామస్వామి దేవస్థానం వద్ద అక్రమంగా నిర్మిస్తున్న గోడను తొలగించాలని పలువురు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మిపతిరావు హామీ ఇచ్చారు.

సచివాలయ ఉద్యోగి మృతి పట్ల సంతాపం

తెనాలిఅర్బన్: రేపల్లె సచివాలయంలో ఏఎన్ఎంగా పనిచేస్తున్న సింగోటి కోటేశ్వరమ్మ ఆత్మహత్య చేసుకుని మృతి చెందడం బాధకరమని రాష్ట్ర వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.శేషుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగ పని ఒత్తిడి వలన ఆమె చనిపోయినట్లు ఆత్మహత్య లేఖలో పేర్కొందని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు.

జీవో 117ను రద్దు చేయాలి



తెనాలిరూరల్: జీవో 117ను రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను వెనక్కు తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో తెనాలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ తెనాలి జోన్ కన్వీనర్ పుట్టా జనార్ధనరావు అధ్యక్షతన ఉపాధ్యాయుల నిరసన ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా బాధ్యుడు సీహెచ్. యోహాన్ మాట్లాడుతూ సంస్కరణల పేరుతో గత ప్రభుత్వం 3,4,5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలలో చేర్చిందని, నేటి ప్రభుత్వం జీఓ 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల నుంచి 3,4,5 తరగతులు వెనక్కి తీసుకువస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోగా ఇప్పుడు అదనంగా 1, 2 తరగతులను ఉన్నత పాఠశాలలోకి కలపడం మోసం చేయడమేనన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీ మేరకు 1 నుంచి 5 తరగతులు ప్రాథమిక పాఠశాలలోను, 6 నుంచి 10 లేక 12 తరగతులు ఉన్నత పాఠశాలల్లో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీ అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నివాహిస్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే ఈనెల 14వ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున మహాధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీహెచ్ లక్ష్మణకుమార్, పి. శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, ఎస్వీఎస్ రాజు, బి. విజయబాబు, ఎ. ఆంజనేయులు, శివనాగేశ్వరరావు, దుర్గారావు, టి. ఏసుబాబు, శ్రీనివాస్, కృష్ణ, యోబు, వెంకటేశ్వర్లు, జేవీ సుబ్బారావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్ధంతరంగా నిలిచిన నిర్మాణాలు

అగమ్య గోచరంగా పాఠశాలల్లో నాడు–నేడు పనుల పరిస్థితి

వేమూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నాడు–నేడు పథకం అగమ్య గోచరంగా మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం కోసం గత ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేసింది. మొదటి విడత, రెండోవ విడత నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడం జరిగింది. శిథిలావస్థకు చేరిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృద్ధికి, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టారు. 2024 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాడు–నేడు పథకం గురించి పట్టించుకోక పోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణం నిలిచిపోయింది. దీంతో పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం పూర్తి అవుతుందా? లేదా అని సందిగ్ధంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధతో చాలా వరకు పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగింది. వేమూరు మండలంలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. పెరవలి, చావలి, జంపని, కుచ్చెళ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం నిధులు కేటాయించి, నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల అభివృద్ధి అగమ్య గోచరంగా మారింది.



చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల పరిస్థితి

చావలి జెడ్పీ హైస్కూల్‌కు రూ.1.10 కోట్లు

చావలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం గత ప్రభుత్వం నాడు–నేడు పథకంలో రూ.1.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం గత ప్రభుత్వం 2022 సెప్టెంబర్‌లో శంకుస్థాపన చేసింది. గదుల నిర్మాణం చాలా వరకు పూర్తి చేశారు. మిగిలిన పనులు చేస్తుండగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు–నేడు పనులపై శ్రద్ధ చూపకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల అభివృద్ధి జరిగేనా లేదా అని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం నిర్మాణం పూర్తిచేసి తరగతి గదులను అందుబాటులోకి తేవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి



నాడు–నేడు పథకం ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టాలి. పాఠశాలల అభివృద్ధి ధ్యేయంగా పని చేయాలి. పాఠశాలలు అభివృద్ధి చెందితే విద్యార్థులు చేరేందుకు ముందుకు వస్తారు.

– తాడికొండ శ్రీనుబాబు, కుచ్చెళ్లపాడు

నిర్మాణం పూర్తి చేయాలి



చావలి జిల్లా పరిషత్ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. కూటమి ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా నిధులు మంజూరు చేయాలి. అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి.

– గోపాలం రాము, చావలి

మద్యం బెల్టు షాపుల తనిఖీ



వేమూరు: మద్యం బెల్టు షాపుల నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ రవి కుమార్ తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో బెల్టు షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు మండలాల్లో సోమవారం బెల్టు షాపులను తనిఖీ చేశారు. కొల్లూరు మండలంలో బెల్టు షాపులు నిర్వహించే వ్యక్తుల సమాచారం సేకరించడం జరిగిందని, బెల్టు షాపులు నిర్వహించరాదని ఆయన హెచ్చరించారు. మద్యం షాపుల నిర్వాహకులు బెల్టు షాపులను ప్రోత్సహించరాదని ఆయన సూచించారు. బెల్టు షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎక్కడ బెల్టు షాపు నిర్వహించినా సహించేదిలేదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలి

రేపల్లె : దేశంలో రోజురోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలని, ఆంధ్రప్రదేశ్‌లో వేతన బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు దయనీయ స్థితిలో బతుకు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెలతో చాలీచాలని జీతంతో కాలం వెళ్లదీస్తున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000గా ఉండాలని భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సైతం పాలక ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి జి.బాలాజీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలులోకి తెస్తూ కార్మికులను కట్టు బానిసలుగా చేసే కుట్రకు పాల్పడుతుందన్నారు. కార్మిక ప్రయోజనాలను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20న దేశ వ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని నిరసన తెలియజేయాలని కోరారు. అనంతరం ఆర్డీవో నేలపు రామలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.కుసుమకుమారి, శ్రీనివాసరావు, శివశంకర్, ముత్యాల వెంకటేశ్వర్లు, రమణ, దుర్గారావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి నివేదికలు సత్వరం అందజేయాలి

రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి

భట్టిప్రోలు (కొల్లూరు) : బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో నివేదికలు సిద్ధం చేసి సత్వరం జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి ఆదేశించారు. సోమవారం భట్టిప్రోలు బౌద్ధ స్తూపాన్ని ఆమె పరిశీలించారు. గత సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని బుద్ధిష్ట సంఘాల నాయకులు, జై భీమ్‌రావ్ భారత పార్టీ నాయకులు బౌద్ధ స్తూపం అభివృద్ధి చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రేపల్లె ఆర్డీవోను బౌద్ధ స్తూపాన్ని పరిశీలించి నివేదిక అందజేయాలని సూచించడంతో ఆమె పలు ప్రభుత్వ శాఖల అధికారులతో బౌద్ధ క్షేత్ర ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె దృష్టికి అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేయడంతోపాటు, దానిపై 50 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని బుద్ధిస్టు సంఘాల నాయకులు తీసుకువెళ్లారు. విదేశీ బౌద్ధ బిక్షువులకు వసతితోపాటు, ఆ ప్రాంతంలో ఉన్న చెరువును అభివృద్ధి చేసి బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసి, భట్టిప్రోలు ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టాలని ఆమెను కోరారు. ఈ నెల 12న బౌద్ధ క్షేత్రం వద్ద బుద్ధ జయంతి వేడుకలను దళిత ప్రజా సంఘాలు, అంబేడ్కర్ వాదులు, బుద్ధిస్టులను మమేకం చేసి జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. బౌద్ధ స్తూపం అభివృద్ధికి నివేదికలను సిద్ధం చేయాలని ఆమె ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆది ఆంధ్ర నవ బుద్ధిస్టు సొసైటీ అధ్యక్షుడు దోవా రమేష్, రాంజీ సొసైటీ ఉపాధ్యక్షుడు నీలా జోజిబాబు, బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియ జిల్లా అధ్యక్షుడు దారం సాంబశివరావు, అఖిల భారత దళిత గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పర్రె కోటయ్య, షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు యన్నం సురేష్, జై భీమ్ రక్షణ సేనా అధ్యక్షుడు పేర్లి మోజస్, న్యాయవాది కొనకాల ప్రసాద్, జిల్లా దళిత నాయకులు కొచ్చర్ల వినయ్‌రాజు, అంబేడ్కర్ సంఘాల ప్రతినిధులు జడ రవీంద్రబాబు, తురిమెళ్ల శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



భట్టిప్రోలు బౌద్ధ స్తూపాన్ని పరిశీలిస్తున్న రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, వివిధ శాఖల అధికారులు

కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో అవసరం

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్

బాపట్ల: కార్ల్‌మార్క్స్ సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో అవసరమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ పేర్కొన్నారు. కార్ల్‌మార్క్స్ జయంతి సందర్భంగా వెదుళ్ళపల్లిలోని కొల్లా వెంకయ్యకాలనీలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. మేకల ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎప్పుడూ బడా కార్పొరేట్లు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయని అన్నారు. శ్రామికుల, చిన్న వ్యాపారుల ఆకలి, ఆర్థిక, అప్పుల సమస్యలను పట్టించుకోవటంలేదని తెలిపారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో ఇప్పటివరకు కొనసాగిన, కొనసాగుతున్న ప్రభుత్వాలు అధికారం చేపట్టిన ప్రతి ప్రభుత్వం నిరుద్యోగ సైన్యాన్ని తయారు చేస్తుందని అన్నారు. 30 సంవత్సరాల లోపు యువతీయువకులు 65 శాతం మంది మన దేశంలో నిరుద్యోగులుగా ఉన్నారని వివిధ నివేదికలు వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం బాపట్ల డివిజన్ అధ్యక్షులు ఓ అజిత, పీవైఎల్ బాపట్ల డివిజన్ అధ్యక్షులు ఈ హఫీజుల్లా, ఇంటి పని వంట పని కార్మిక సంఘం సభ్యులు వెంకాయమ్మ, వీధి వ్యాపారుల సంఘం నాయకులు నాగూర్ బీ, మస్తానీ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేపట్టిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

‘విప్రో’ కొలువులకు 11 మంది ఏఎస్ఎన్ విద్యార్థులు

తెనాలి: ప్రముఖ ఐటీ కంపెనీ విప్రో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలజీ ఫైనలియర్ బీసీఏ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) విద్యార్థులు 11 మంది ఎంపికయ్యారు. విప్రో కంపెనీ నిర్వహించే ‘వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రాం’ కింద ఎంపికైన విద్యార్థులు కంపెనీలో పని చేస్తూనే బిట్స్ పిలానీలో ఎంటెక్ కోర్సును పూర్తిచేస్తారని, అందుకయే ఖర్చును కంపెనీ భరించటమే కాకుండా ఏటా స్కాలర్‌షిప్ కింద నాలుగేళ్లలో నెలకు రూ.15,500 నుంచి రూ.23 వేల చొప్పున అందచేస్తుంది. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సోమవారం కాలేజీలో విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. ఎంటెక్ పూర్తయ్యాక వీరికి రూ.14 లక్షల వార్షిక వేతనం లభిస్తుందని చెప్పారు. ఎప్పటికప్పుడు మారుతున్న కంపెనీల అవసరాల ప్రకారం వీరికి ఈలోపుగానే శిక్షణ పూర్తవుతుందని వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు 93 శాతం మంది ఉద్యోగాలకు ఎంపికవటం గర్వకారణమన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, రెండేళ్ల తర్వాత విప్రో ఐటీ ఉద్యోగాలకు డిగ్రీ విద్యార్థులకు వర్చువల్ మోడల్‌లో జరిపిన క్లిష్టమైన ఇంటర్వ్యూలో ఎంపికైన 11 మంది విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.



ఎంపికైన విద్యార్థులతో మాజీ ఎమ్మెల్యే శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

మోసం చేసిన వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: క్రెడిట్ సొసైటీ పేరిట మోసానికి పాల్పడిన వ్యక్తిపై కేశు నమోదైంది. ఠలో ఈసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన కొల్లూరు వెంకటేశ్వరరావు బాపట్ల జిల్లా వేమూరు మండలం చావలి గ్రామంలో మణికంఠ థ్రిఫ్ట్ క్రెడిట్ సొసైటీ పేరిట కార్యాలయాన్ని తెరిచాడు. గ్రామానికి చెందిన సుమారు 100 మందితో పాటు తెనాలికి చెందిన కొంత మందిని రూ. 10 కోట్ల వరకు మోసం చేస్తూ వారం రోజులుగా కనబడకుండా పోయాడు. బాధితులు టూ టౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు సీఐ రాముల నాయక్ సోమవారం తెలిపారు.

అన్న చేసిన మోసానికి నాకేం సంబంధం?

తెనాలిరూరల్: కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పేరిట ప్రజలను మోసం చేసి ఐపీ పెట్టిన విషయంలో తనకేం సంబంధం లేదని కొల్లూరు మురళీకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి విలేకర్లతో మాట్లాడారు. తన అన్న వెంకటేశ్వరరావు మణికంఠ జ్యుయలర్స్‌ను తనకు మూడేళ్ల కిందట విక్రయించాడని, అనంతరం షోరూం పెట్టినా అందులో గ్రాము బంగారం లేకుండానే వ్యాపారం చేశాడని తెలిపాడు. క్రెడిట్ సొసైటీ పెడితే ప్రజలు ఎలా నమ్మి డబ్బు ఇచ్చారో తనకు అర్థం కావడం లేదని, తన అన్న ఇవ్వాల్సిన డబ్బుకు తన దుకాణాన్ని బాధితులు లూటీ చేశారని తెలిపారు. తనకు సంబంధం లేని విషయాన్ని తనకు ఆపాదిస్తున్నారని, తన అన్న చేసిన మోసానికి తనకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.

పాదచారులకు మజ్జిగ పంపిణీ



తెనాలి: పట్టణానికి చెందిన అన్నదాత సుఖీభవ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద పాదచారులకు రాగిపిండి కలిపిన మజ్జిగను పంపిణీ చేశారు. వెంకటేశ్వర యోగ తెనాలి శాఖ కన్వీనర్ ముద్దాభక్తుని సాయికృష్ణ, దివ్య కుమారుడు నాగ కౌశిక్ సహకారంతో ఈ సేవను చేపట్టారు. లయన్స్ క్లబ్ తెనాలి స్నేహ వ్యవస్థాపకుడు కాకరపర్తి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండు వేసవిలో పాదచారులకు మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ సేవాగుణంతో ఇటువంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. బీజేపీ తెనాలి అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు మజ్జిగ పంపిణీ కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. సామ్రాజ్యం, శ్రీనివాసరావు, అన్నదాత సుఖీభవ సభ్యులు పాల్గొన్నారు.

దైవ సేవతో మానసిక ప్రశాంతత

రేపల్లె : దైవ సేవతో మానసిక ప్రశాంతత కలుగుతుందని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ చెప్పారు. పట్టణంలోని ఒకటో వార్డు రామ మందిరంలో సోమవారం జరిగిన సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం విశిష్టతను ప్రతి ఒక్కరికి తెలియజెప్పేలా సమరసత సేవా ఫౌండేషన్, తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో గ్రామాలలో ప్రతి నెల ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 22న హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. టీటీడీ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకటో వార్డులో నిర్మించిన సీతారామ మందిరం వార్షికోత్సవం 12న జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమశంకరరావు, పేరం కోటేశ్వరరావు, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, డొక్కు రామయ్య, స్వాములు, గోవిందు, నంబూరు వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయ ప్రముఖ్ సత్యనారాయణ

సమస్యల పరిష్కార వేదికకు 8 అర్జీలు

రేపల్లె : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 8 అర్జీలు అందినట్లు ఆర్డీవో నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. భూసర్వేపై రేపల్లె మండలం ఉప్పూడి గ్రామం నుంచి నాలుగు దరఖాస్తులు అందాయన్నారు. తమ గృహానికి అమర్చిన 7 కిలోవాట్స్ పవర్ మీటర్‌ను 3 కిలోవాట్స్ మీటర్‌గా మార్చాలని కోరుతూ 19వ వార్డుకు చెందిన శివప్రసాద్ అర్జీ ఇచ్చాడన్నారు. ఆక్రమణకు గురైన తమ స్థలాన్ని సర్వే చేసి ఆక్రమణలు తొలగించాలని కొల్లూరు మండలం పోతర్లంక గ్రామానికి చెందిన ఆలూరి మల్లేశ్వరి అర్జీ ఇచ్చిందన్నారు. తాను ఏ డ్వాక్రా గ్రూపు నుంచి రుణం పొందలేదని అయితే రుణం పొందినట్లుగా తిరిగి చెల్లించాలని బ్యాంకు నుంచి నోటీసులు వస్తున్నాయని విచారించి న్యాయం చేయాలని కోరుతూ 1వ వార్డుకు చెందిన బొలిశెట్టి ఆదిలక్ష్మి ఫిర్యాదు చేసిందన్నారు. తమ ఇంటి వరకు రహదారి నిర్మాణం చేయాల్సి ఉండగా 25 మీటర్ల దూరంలోనే నిర్మాణం ఆపివేశారని తమ ఇంటి వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతూ రేపల్లె మండలం నల్లూరుపాలెం గ్రామానికి చెందిన హనుమంతరావు అర్జీ ఇచ్చాడన్నారు. ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.



అర్జీలు పరిశీలిస్తున్న ఆర్డీవో నేలపు రామలక్ష్మి

దాహార్తి తీర్చడం అభినందనీయం

సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా డైరెక్టర్ నాగిరెడ్డి

బాపట్ల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేయడం సంతోషనీయమని ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ సభ్యులను సమగ్ర శిక్ష అభియాన్ బాపట్ల జిల్లా డైరెక్టర్ నాగిరెడ్డి అభినందించారు. బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఏర్పాటు చేసే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదులు చేయడానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రజలకు ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా డైరెక్టర్ నాగిరెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్నేహితులందరూ కలిసికట్టుగా అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలకు వేసవి తాపాన్ని తగ్గించేందుకు గత అనేక వారాలుగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేస్తున్నారని భవిష్యత్తులో ప్రజలను ఆదుకునేందుకు ఆర్గనైజేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బి.గోపి, కోశాధికారి సువర్ణ రాజు, సభ్యులు శివ, కోటేశ్వరరావు, శ్రీకృష్ణ, విన్నకోట శ్రీనివాసరావు, పులిపాటి రాజు, తన్నీరు గోపి, ఆత్మకూరు నరేష్, నరాలశెట్టి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ బాపట్ల జిల్లా డైరెక్టర్ నాగిరెడ్డి

చెత్త సేకరణ పకడ్బందీగా చేయండి

కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: చెత్త సేకరణను పకడ్బందీగా చేయాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. రామలింగేశ్వర పేట, గురవయ్య కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్తను వేరు వేరుగా సేకరించి జిందాల్ సంస్థకు పంపాలని సూచించారు. నూరు శాతం చెత్త సేకరణ జరిగే విధంగా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.



నూరు శాతం చేయాలి

చెత్త సేకరణ నూరు శాతం చేసి పూర్వ వైభవాన్ని తీసుకురావాల్సిన అవసరం అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో సోమవారం నగర దీపికలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తడి, పొడి హానికర చెత్తల సేకరణ రాష్ట్రంలో మొట్టమొదటిసారి తెనాలిలో ప్రారంభించడం జరిగిందని, ఆ సమయంలో నూరు శాతం చెత్త సేకరణ జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయన్నారు. సమావేశంలో ఏసీ వీఎం లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పాల్గొన్నారు.

చెంచుపేటలో ఆక్రమణలు తొలగింపు



తెనాలిఅర్బన్: చెంచుపేటలోని ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణల తొలగింపు చర్యలను మున్సిపల్ అధికారులు చేపట్టారు. ఆర్పీఎం క్లబ్ రోడ్డు వైపు ఉన్న ఆక్రమణలన్నింటిని జేసీబీతో సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ టీపీవో సాంబశివరావు మాట్లాడుతూ 15 రోజుల క్రితమే వ్యాపారులకు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవాలని సూచించడం జరిగిందన్నారు. కొందరూ వ్యాపారులు మురుగు కాల్వలపై వ్యాపారం చేస్తుండటంతో వాటిన్నింటినీ తొలగించడం జరిగిందన్నారు. ఇది ఇలా ఉంటే మున్సిపల్ అధికారులు తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా వీటిని తొలగిస్తున్నారని కొందరూ వ్యాపారులు ఆరోపించారు. కార్యక్రమాన్ని అసిస్టెంట్ సిటీ ప్లానర్ వాణి పర్యవేక్షించారు.